సాక్షి బాపట్ల

సోమవారం । 10 । మార్చి । 2025



వైభవంగా ఆలయ పునఃప్రతిష్ట

రేపల్లె రూరల్: రేపల్లె పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని శ్రీ సిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవాలయ పునఃప్రతిష్టా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.



శత చండీ మహాయాగం

సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్టా బ్రహ్మ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బాపట్ల : బాపట్ల మండలం కొండుబొట్లపాలెం గ్రామంలోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
బాపట్ల	6.22	5.03
గుంటూరు	6.22	5.03
నరసరావుపేట	6.24	5.05

న్యూస్‌రీల్

గుంటూరుకు 100 ఎలక్ట్రిక్ బస్సులు

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం గుంటూరు పట్టణానికి 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, ఛార్జింగ్ పాయింట్లు తదితర ఏర్పాట్ల కోసం ఆదివారం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ బస్సులను ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్లు వరకు ప్రయాణించగలవన్నారు. వీటిని నిర్వహించాలంటే ప్రత్యేక సదుపాయాలు కావాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఉందని గుర్తుచేశారు. బస్టాండ్, ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకుపోను మిగిలిన స్థలంలో పీపీపీ పద్ధతిలో లీజులకు ఆర్టీసీ స్థలాలను ఇస్తే సంస్థకు ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు కసరత్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఈడీ అడ్మిన్ జి. రవివర్మ, ఈడీ జోన్ 3 నెల్లూరు నాగేంద్రప్రసాద్, ఆర్ఎం ఎం.రవికాంత్, డిపో మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి



అద్దంకి రూరల్: మైనార్టీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో రంజాన్ మాసం జేబు క్యాలెండర్ ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 5434 కోట్లు ప్రకటించారన్నారు. సబ్ ప్లాన్ అమలుతో మైనార్టీలు అభివృద్ధి చెందుతారని తెలిపారు.

అవయదానంతో ముగ్గురికి కొత్త జీవితం



వరలక్ష్మి (ఫైల్)

గుంటూరు మెడికల్: ఓ మహిళ అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి అంగీకరించడంతో ముగ్గురికి నూతన జీవితం లభించింది. వివరాలు.. బాపట్ల జిల్లా బాపట్ల పట్టణం వివేకానంద నగర్ కాలనీకి చెందిన కొపనాతి వరలక్ష్మి (45) మెదడు సంబంధిత వ్యాధితో ఈ నెల 6న గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో చేరారు. ఆమె పరిస్థితి విషమంగా మారి ఆదివారం బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ జీవన్ దాన్ ప్రతినిధులు వరలక్ష్మి కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు విశాల హృదయంతో అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో జీవన్మరణ స్థితిలో ఉన్న ముగ్గురికి కొత్త జీవితం ప్రసాదించారు. జీవన్ దాన్ ప్రతినిధులు ఊపిరితిత్తులను తెలంగాణ రాష్ట్రానికి చెందిన కిమ్స్ ఆసుపత్రికి, కిడ్నీ, లివర్‌లను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు అందించారు. ఊపిరితిత్తులను గ్రీన్ చానల్ ద్వారా గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు తరలించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, క్లస్టర్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్ కార్తిక్ చౌదరి అవయవదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

శ్రీనివాస కల్యాణ వేడుక ఏర్పాట్లు పరిశీలన

వెంకటపాలెం (తాడికొండ): తుళ్ళూరు మండలం వెంకటపాలెంలోని టీటీడీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 15వ తేదీన జరగనున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో సీఎం పాల్గొననున్న దృష్ట్యా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

చౌకచక్యంగా పట్టించారు!

కూటమిలో చౌకదుకాణం చిచ్చు

- పర్చూరులో టీడీపీ, జనసేన మధ్య విబేధాలు
- ప్లాన్ చేసి జనసేనకు చెందిన డీలర్‌కు చెక్ పెట్టిన పచ్చనేత
- లారీకి తక్కువ వచ్చాయని చౌకబియ్యం సేకరణ
- నమ్మి బియ్యం అమ్మిన ఇందిరానగర్–7 రేషన్ డీలర్
- తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో దాడిచేయించిన పచ్చనేత
- కేసుకు భయపడి రాజీనామా చేసిన డీలర్ నవత
- కూటమి అధికారంలోకి రాగానే డీలర్‌షిప్ కొట్టేసేందుకు పావులు కదిపిన దందా నిర్వాహకుడు
- టీడీపీ నేత పన్నాగాన్ని జనసేన డీలర్ చెవిన వేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి
- పచ్చనేత దురాగతంపై జనసేన నేతల ఆగ్రహం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: దశాబ్దాలపాటు కలిసి కాపురంచేస్తామని ఇటు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అటు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు పదేపదే చెప్పినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. చాలాచోట్ల పచ్చనేతలు, జనసేన కార్యకర్తలకు మధ్య సమన్వయంలేదు. కొన్ని చోట్ల ఒకరంటే మరొకరికి గిట్టడంలేదు. ఇంకొన్నిచోట్ల ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి, బాపట్ల, వేమూరులాంటి నియోజకవర్గాల్లో చంద్రబాబు సామాజికవర్గంతో పోలిస్తే జనసేన అధినేత సామాజికవర్గం తక్కువ జనాభా, ఓటర్లను కలిగి ఉండడంతో పచ్చపార్టీ నేతలు వారిని ఖాతరు చేయడంలేదు. తాజాగా పర్చూరు ఇందిరా నగర్–7 చౌకదుకాణం పంచాయతీ పచ్చపార్టీ, జనసేనల మధ్య చిచ్చురేపి హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తలకు చుట్టుకోగా జనసేన ఫిర్యాదుతో అటు పచ్చపార్టీ అధిష్టానానికి సైతం చేరినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులోని ఇందిరానగర్–7 చౌక దుకాణానికి 2000 సంవత్సరం నుంచి నవత డీలర్‌గా ఉన్నారు. భర్త మృతి చెందగా డీలర్‌షిప్పును నడుపుకొంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. పవన్‌కళ్యాణ్ మీద అభిమానంతో నవత కుటుంబం జనసేన ఆవిర్భావం నుంచి ఆ పార్టీతోనే ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ ఆమె డీలర్‌గా కొనసాగారు. కూటమి అధికారంలోకి రాగానే స్థానిక పచ్చనేత సదరు డీలర్‌షిప్పు కొట్టేసేందుకు పెద్ద ప్లాన్ వేశారు.

మండిపడుతున్న జనసేన శ్రేణులు..

ఎన్నికల్లో టీడీపీకి ఓట్లేసి గెలిపిస్తే 25 ఏళ్లుగా డీలర్‌గా నవతను వితంతు అని కూడా చూడకుండా టీడీపీ నాయకుడు స్వయంగా అధికారులకు పట్టించి తొలగించడంపై జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. డీలర్ తనయుడు జనసేన కీలక నాయకుడుగా ఉన్నారు. పర్చూరు నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ సామాజికవర్గం ఓటర్లు 20 వేలకు పైగా ఉన్నాయి. ఇప్పుడు వారంతా పచ్చపార్టీపై ఆగ్రహంతో ఉన్నారు. అటు జనసేన అధిష్టానానికి విషయం చేరవేసినట్లు సమాచారం. దీంతో సమస్య పచ్చపార్టీ అధిష్టానానికి సైతం చేరినట్లు తెలుస్తోంది. మొత్తంగా చౌకదుకాణం వ్యవహారం ఇప్పుడు పర్చూరు కూటమిలో చిచ్చురేపింది.

వ్యూహం పన్నారు.. పట్టించారు..



పర్చూరులో చౌకబియ్యం దందా నిర్వహించే సుమన్ బియ్యం లోడుకు తక్కువగా ఉన్నాయని, మీవద్దవున్న మొత్తం బియ్యం ఇవ్వాలంటూ డీలర్ నవతపై ఒత్తిడి పెట్టారు. 15వ తేదీ తర్వాత బియ్యం ఇస్తామని, ముందుగా ఇస్తే అధికారులతో సమస్య అవుతుందని నవత కుటుంబం చెప్పింది. అంతా తాను చూసుకుంటానని, అధికారుల భయంలేదని సుమన్ భరోసా మాటలు చెప్పారు. అసలే పచ్చనేతల దందా.. బియ్యం ఇవ్వకపోతే అదోతంటా ఎందుకని నవత కుటుంబం ఈ నెల 6వ తేదీన దందా నిర్వాహకుడు సుమన్‌కు తమవద్దవున్న రేషన్‌బియ్యం అప్పగించారు. 7వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నవత చౌకదుకాణంపై దాడిచేశారు. బియ్యంలేవని నిర్ధారించుకొని కేసు కట్టాలా? రాజీనామా చేస్తారా? అంటూ బెదిరించారు. ఇదే సమయంలో బియ్యం దందా నిర్వాహకుడు సుమన్‌కు డీలర్ ఫోన్‌చేశారు. అక్కడికి వచ్చిన సుమన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను పక్కకు తీసుకెళ్లి మాట్లాడి అధికారులు తన మాట వినడంలేదని, మీరే మాట్లాడుకోవాలని డీలర్‌కు చెప్పి అక్కడినుంచి జారుకున్నాడు. వాస్తవానికి బియ్యం లెక్కల్లో తేడాలొస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేయాలి. కానీ పచ్చనేత ఒత్తిడితో అలా అలా చేయకుండా కేసులు కడితే కోర్టుచుట్టూ తిరగాల్సి వస్తుందని, మహిళగా ఉండి కోర్టుకు వెళ్లడం సరికాదని, రాజీనామా చేయడమే మంచిదని నవతను బెదిరించారు. అధికారుల ఒత్తిడి భరించలేక నవత అదేరోజు డీలర్ పదవికి రాజీనామా చేశారు. తాము చెప్పగానే రాజీనామా చేసిన నవతపై సానుభూతి చూపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెళుతూ వెళుతూ పచ్చనేత ఒత్తిడితోనే తాము వచ్చామని, మీరు బియ్యం అమ్మిన విషయం చెప్పి పట్టించింది అతనేనంటూ అసలు విషయం ఆమెకు చెప్పి జారుకున్నారు.

ప్రభువుకు కృతజ్ఞత స్తుతులతో రక్షణ



భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య

విజయపురిసౌత్: ''ఏసు ప్రభువునకు ఎల్లప్పుడూ కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట రక్షణ దాయకమ''ని గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. సాగర్‌మాత మహోత్సవం ముగింపు రోజైన ఆదివారం నిర్వహించిన సమష్టి దివ్య బలి పూజలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పవిత్రాత్మ ప్రభావం వల్ల కన్నె మరియమాత గర్భాన దివ్యజ్యోతి అయిన ఏసుక్రీస్తును ఈ జగతికి ప్రసాదించినట్లు పేర్కొన్నారు. పవిత్రమైన ఏసుక్రీస్తును దీనభావంతో స్తుతించాలని తెలిపారు. ఆధ్యాత్మిక ఆయుధాలైన ప్రార్థన, ప్రేమ, నీతి, కరుణ, దయ, క్షమాగుణం కలిగిన వ్యక్తులు దేవుని మార్గంలో నడిపింపబడుతున్నారని అర్థం అని పేర్కొన్నారు. సాగర్‌మాత మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు దేవుడు ఐశ్వర్య, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించారు.

రథోత్సవంతో ఉత్సవాలు ముగింపు

ఆదివారం రాత్రి సాగర్ మాత రథోత్సవం ప్రధానమైంది. ఈ ఊరేగింపుతో ఉత్సవం ముగుస్తుంది. ఉదయం 5గంటలకు అత్తలూరు విచారణ గురువులు చాట్ల కస్పార్, 6గంటలకు కారంపూడి విచారణ గురువులు పెట్ల మర్రి అనిల్, 7గంటలకు ముట్లూరు విచారణ గురువులు మార్నేని దిలీప్, 8గంటలకు దాచేపల్లి విచారణ గురువులు గురుశ్రీ ఏరువ బాలశౌరెడ్డి, ఉదయం 10.30 గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్య సమష్టి దివ్య పూజలు నిర్వహించారు. పామిశెట్టి తోమస్ బృందం గానం ఆకట్టుకుంది. ఫాదరన్లు జోసఫ్ బాలసాగర్, తంబి, మనోజ్ కుమార్, ఆలయ పెద్దలు ఎం. జోషి, జెక్కిరెడ్డి చిన్నపరెడి, డి. ఇన్నారెడ్డి, కె. శౌర్రాజు, మరియ దాసు, శౌరిబాబు, బాలస్వామి పాల్గొన్నారు.

పీ–4 పేరిట పథకాలకు కోత?

- సంక్షేమ పథకాలు కోత వేసేందుకే సర్వే ?
- గ్రామాల్లో శనివారం నుంచి సర్వే ప్రారంభం
- 27 రకాల ప్రశ్నలతో నిర్వహణ
- ఇళ్లలోని విలువైన వస్తువుల వివరాలు నమోదు
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



వేటపాలెంలో పీ- 4 సర్వే పరిశీలిస్తున్న ఆర్‌డీఓ చంద్రశేఖర్ నాయుడు, అధికారులు

వేటపాలెం: సూపర్ 6 .. ఈ నినాదాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సభల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. పేద ప్రజల జీవితాలు మార్చి వేస్తానని ప్రజలకు ఆశలు కల్పించారు. దీంతో గంపెడు ఆశతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం కట్ట బెట్టారు. తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిదిన్నర నెలలు గడుస్తున్నా వాటి అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పీ- 4 సర్వే పేరిట ఉన్న వాటిని కొల్లగొట్టేందుకు సమాయత్తం అవుతున్నట్లు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఫోన్, టీవీ, ఏసీ, ఇతర గృహోపకరణాలు, శ్లాబా, బ్యాంక్ అకౌంట్ ఉందా.. ఇలా 27 రకాల ప్రశ్నలకు సమాధానాలను సిబ్బంది నింపాల్సి ఉంది. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి ప్రక్రియను ముగించనున్నారు.

ఏసీ ఉన్నా సంక్షేమం కట్?

జిల్లాలో 4,70,200 వేల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. వీటి కోసం మరో లక్ష పైచిలుకు ఫ్యామిలీలు ఎదురుచూస్తున్నాయి. చీరాల నియోజకవర్గం పరిధిలో 57,010 కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. వీరంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలుగానే పరిగణించాలి. అప్పో సొప్పో తెచ్చుకొని నెలవారీ వాయిదాలతోనో, లేక ఎవరైనా కానుకగా ఇస్తే వారి ఇళ్లలో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇది ఉందని తెలిస్తే చాలు వెంటనే ఆ వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

నమ్మండయ్యా..

పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్‌తో నిర్వహించేదే పీ- 4 సర్వే. దీన్ని విశ్వసించాలని పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీఓలు ప్రజలను అభ్యర్థిస్తున్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలోని కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఇళ్ల వద్దకు సిబ్బంది వెళ్లి వివిధ సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, ఇందులో ఎలాంటి అపోహలొద్దని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో అంతా అయోమయం నెలకొంది.

సర్వే పూర్తయ్యాక, విధివిధానాలు..

సర్వే నివేదిక ప్రాతిపదికన ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం పీ- 4ను ఉగాది పర్వదినాన ప్రారంభించనున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అట్టడుగున ఉన్న 20 శాతం మంది కోసం, అగ్రశ్రేణిలో ఉన్న పదిశాతం మంది సంపన్న వ్యక్తులు సహకరించేలా చూసేందుకే ఈ విధానమని తెలిపారు. ఉన్నతస్థాయి పారిశ్రామికవేత్తలు, ఆయా ప్రాంతాలకు చెందిన ఎన్నారైల సహకారంతో పీ- 4 విధానం ద్వారా పేద కుటుంబాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

వద్దన్నా నమోదు..

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే, స్మార్ట్‌ఫోన్, బైక్‌లు, ఇలాంటి ప్రశ్నలే ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే, వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ అవ్వడం కలవరానికి గురిచేస్తోంది.

లక్ష్యానికి తూట్లు.. పశుపోషకుల పాట్లు

- నిలిచిన సంచార పశు వైద్యసేవలు
- జిల్లాకు రెండు విడతల్లో 12 వాహనాలను కేటాయించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- జీవీకే ఫౌండేషన్‌కు నిర్వహణ బాధ్యతలు
- 1962 టోల్‌ఫ్రీ ద్వారా గ్రామాల్లో అంబులెన్స్ సేవలు
- మొదటి విడత ఆరు వాహనాలకు గడువు పొడిగించని కూటమి ప్రభుత్వం
- మెయింటెనెన్స్ లేక మూలన పడిన రెండోవిడత ఆరు వాహనాలు
- అయోమయంలో పశుపోషకులు



బల్లికురవలో నిలిచిన సంచార వాహనం

బల్లికురవ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పరచిన ఉన్నత లక్ష్యాలకు నేటి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మూగ జీవాలకు అత్యవసర వైద్యసేవలను ఆయా గ్రామాల్లోనే అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి రెండు చొప్పున 350 సంచార పశువైద్య వాహనాలను కేటాయించారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గ కేంద్రాలకు తొలి విడతలో 2022 మే నెలలో ఆరు వాహనాలను కేటాయించారు. 2023 ఫిబ్రవరిలో నియోజకవర్గానికి రెండో వాహనాన్ని కేటాయించారు. ఇలా మొత్తం జిల్లాకు 12 వాహనాలు కేటాయించారు. రెండు నుంచి మూడు మండలాలకు కలిపి ఈ సంచార వాహనాన్ని కేటాయిస్తూ ఆయా పశువైద్యశాలలో పశుపోషకులకు అందుబాటులో ఉంచారు. ఈ వాహనానికి వైద్యుడు, ప్యారావిట్, పైలట్ పోస్టులు కేటాయించారు. గ్రామాలవారీగా పశుపోషకులకు అత్యవసర వైద్య సేవలందించేందుకు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ను కేటాయించారు. ఈ నెంబర్‌కు ఫోన్‌చేసి రైతు పేరు, గ్రామం, లోకేషన్, మండలం, జిల్లా తెలియచేయగానే వెంటనే గ్రామానికి వాహనం వచ్చి వైద్య సేవలందిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశువైద్యసేవలను నిర్వీర్యం చేసింది. కాంట్రాక్టును పునరుద్ధరించకపోవడంతో మొదటివిడత జిల్లాకు వచ్చిన ఆరు వాహనాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. రెండో విడతలో వచ్చిన వాహనాలు మెయింట్‌నెన్స్‌లేక పశువైద్యశాలలకే పరిమితమయ్యాయి.



పశువులకు చికిత్స అందిస్తున్న పారావిట్ (ఫైల్)

గడువు పునరుద్ధరించక..

అంబులెన్స్‌ల నిర్వాహణ బాధ్యతను రాష్ట్రవ్యాప్తంగా జీవీకే ఫౌండేషన్‌కు అప్పగించటంతో మూడు సంవత్సరాలుగా వైద్యులు, సిబ్బంది జీతాలు, మెయింటనెన్స్ సక్రమంగానే అందించారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 28తో నిర్వహణ కాలవ్యవధి పూర్తవటంతో మొదటి విడతలో అందించిన వాహనాలను జిల్లా కేంద్రాలకు తెప్పించుకున్నారు. రెండో విడత వాహనాలకు మెయింట్‌నెన్స్ నిలిచి పోవటంతో పశు వైద్యాశాలలకే పరిమితం అయ్యాయి. బల్లికురవ, సంతమాగులూరు మండలాలకు కేటాయించిన వాహనం బల్లికురవ పశువైద్యశాలలో మార్టూరు, యద్దనపూడి మండలాలకు కేటాయించిన వాహనం మార్టూరు వైద్యశాలకే పరిమితం అయింది.

సంచార వైద్యసేవలు కొనసాగించాలి



పశువులకు వైద్య వసతిలేని మారుమూల గ్రామాల్లో అత్యవసర వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లు గ్రామాల్లోకి రావటంలేదు. వైద్యాధికారిని అడిగితే వాహనాలు మరమ్మతులకు గురై అందుబాటులో లేవని చెబుతున్నారు. పశువైద్యానికి ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలను కొనసాగించి వైద్యసేవలందించాలి.

– బూసా వెంకటేశ్వర్లు, రామాంజనేయపురం

10 కి.మీ తోలుకెళ్లాల్సి వస్తుంది..



మూగ జీవాలకు అత్యవసర చికిత్సకు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే గ్రామానికే వచ్చి గత రెండేళ్లుగా ఉచిత వైద్యసేవలందించారు. ఇటీవల కాలంలో ఫోన్ చేసినా గ్రామానికి రావటంలేదు. విచారణ చేస్తే మెయింట్‌నెన్స్ లేక మండల కేంద్రాల్లోని పశువైద్యసేవల్లో ఉన్నాయని చెప్పారు. వ్యవప్రయాసలతో 10 కి.మీ. దూరంలోని వైద్యశాలకు పశువులను తోలుకెళ్లాల్సి వస్తోంది.

– గన్నమనేని సీతారెడ్డి, కొప్పరపాలెం

మొదటి విడత అంబులెన్స్‌లకు గడువు పూర్తయింది

సంచార పశువైద్య అంబులెన్స్‌ల మొదటి విడత వాహనాలకు గడువు పూర్తి అవటంతో సేవలు నిలుపుదల చేసి స్వాధీన పరుచుకున్నాం. రెండో విడత వాహనాల ద్వారా ప్రస్తుతం కేటాయించిన మండలాలకు సేవలందిస్తున్నాం. వాహనాల మరమ్మతుల బాధ్యత జీవీకే ఫౌండేషన్‌దే. ఈ విషయాన్ని ఫౌండేషన్‌కు తెలియజేస్తాం. ప్రస్తుతం పశు వైద్యశాలలకు వెళ్లి పశుపోషకులు వైద్యం చేయించుకోవాలి.

– బి.వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ జేడీ, బాపట్ల

ప్రార్థనతోనే దేవుడి అనుగ్రహం

- ముగిసిన 48వ గుడారాల పండుగ
- ముగింపు ప్రార్థనలు చేసిన పాస్టర్లు జాన్‌వెస్లీ, అబ్రహాం
- దయా క్షేత్రానికి చేరుకున్న లక్షలాది మంది విశ్వాసులు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



ప్రసంగిస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ

అమరావతి: ''ప్రభువైన ఏసుక్రీస్తు కృప లోకమంతా నిండియున్నదని, మానవుడు దేవుని ఎంతగా ప్రార్థిస్తే అంతగా దేవుడికి దగ్గరవుతాడని హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లేమల్లె హోసన్నా దయా క్షేత్రంలో హోసన్నా మినిస్ట్రీస్ నిర్వహిస్తున్న 48వ గుడారాల పండుగ చివరి రోజు పగటిపూట ముగింపు ప్రార్థనలకు లక్షలాది మంది ఆరాధికులు తరలివచ్చారు. పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగిస్తూ.. జాతి, కుల, మత, వర్గ, పేద, ధనిక భేదం లేకుండా అందరికీ దేవుని కృప ఉంటుందని, ఆయన్ను స్తుతిస్తూ బలి పీఠం దగ్గరకు ఎవరు వస్తారో వారిపై ప్రత్యేక కృప కనబరుస్తాడని పేర్కొన్నారు. ప్రపంచంలో అందరి పైనా ఆయన వర్షం కురిపించినా ఆత్మీయులపై మాత్రం కృపా వర్షం కురిపిస్తాడని పేర్కొన్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ అబ్రహాం ప్రసంగిస్తూ.. గుడారాల పండుగలో దేవుని దర్శించిన ప్రతి ఒక్కరి వెంట ఆయన వస్తున్నాడని.. మంచిని కలుగచేస్తాడని తెలిపారు. దురాత్మలను దూరం చేసి సంతోషం కలుగ చేస్తాడని వివరించారు. ఎంతో దూరం నుంచి వచ్చిన లక్షలాది మంది విశ్వాసులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించకపోయినా, సర్దుకు పోయిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 5,6,7,8 తేదీల్లో గుడారాల పండుగ నిర్వహిస్తామని ప్రకటించారు. గుడారాల పండుగకు సహకరించిన అన్ని ప్రభుత్వశాఖల అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. లక్షలాదిమంది విశ్వాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



చీరాల: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు. వేటపాలెం మండలం రామాపురంలోని బీచ్ రోడ్‌లోని వాయల రాంబాబు కూల్‌డ్రింక్ షాపులో రైడ్ చేయగా విస్కీ 7 సీసాలు, ఇంపీరియల్ బ్లూ 4, ఎంసీ డోవేల్స్ 3 మొత్తం 14 బాటిల్స్‌ను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మడం నేరమన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



చీరాలటౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా జమండ్లమూడి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, మాజీ సలహాదారు షేక్ యూసుఫ్ మొహరాలి అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం అధ్యక్షులుగా జమండ్లమూడి శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా ఎస్.కృపాచార్యులు, జనరల్ సెక్రటరీగా సాయి మహేష్, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సూర్యనారాయణ, సభ్యులను ఎన్నుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం బలోపేతం చేయడంతోపాటు హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అందరం ఐక్యమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

గూడ్స్ రైలు కిందపడి టైల్స్ మేస్త్రి ఆత్మహత్య



నరసరావుపేట టౌన్: గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొండపాడుకు చెందిన పుట్లూరి శివారెడ్డి(42) పట్టణంలోని బరంపేటలో నివాసం ఉంటున్నాడు. టైల్స్ మేస్త్రిగా జీవనం కొనసాగిస్తున్నాడు. శావల్యాపురం రైల్వే స్టేషన్ సమీపంలో వెల్లలచెరువు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉత్తమ లక్ష్యాలతో ఉన్నత శిఖరాలకు..

- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్
- రేపల్లెలో పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం ప్రారంభం


పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించి, శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను కలిగి తమ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.8కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు పొందటమే కాకుండా, స్వయంగా సైతం ఆయా రంగాలలో ఉపాధిని పొందవచ్చన్నారు. అన్నిరకాల హంగులతో నిర్మించిన సాంకేతిక కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలోని శిలాఫలకాన్ని ఆవిష్కరించి కళాశాల భవంతిని ప్రారంభించారు. ఆయనతో పాటు సాంకేతిక విద్యాశాఖ జేడీ పద్మారావు, ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్, ఈఈ భాస్కర్ బాబు, డీఈ రామమోహనరావు, ఆర్డీఓ నేలపు రామలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ సాంబశివరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పూర్తి

రేపల్లెలో సాంకేతిక విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో 2010 సంవత్సరం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో తాత్కాలిక భవంతిలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసింది. శాశ్వత భవనం లేకపోవటం, సరైన సౌకర్యాలు లేకపోవటంతో విద్యార్థులు అంతంత మాత్రపు సౌకర్యాలతోనే విద్యాభ్యాసం చేసేవారు. అయితే తదుపరి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల శాశ్వత భవనం ఏర్పాటును నీరుగార్చారు. దీంతో విద్యార్థులు, విద్యాసంఘాలు ఆగ్రహించి 2015 సంవత్సరంలో ఉద్యమాలు చేపట్టినప్పటికీ ఫలితం దక్కకపోవటంతో నిరాశ పడ్డారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల కోసం రూ.8కోట్లు నిధులు కేటాయించి ప్రత్యేక చొరవ చూపి భవంతిని పూర్తిచేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల తరువాత కళాశాలను ప్రారంభించింది. కళాశాల పనులు చురుగ్గా సాగటంతో పాటు అవసరమైన పూర్తి మౌలిక వసతులతో కళాశాలను ఏర్పాటుకు కారణమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయినులతో యూనియన్ నేతలు

తెనాలి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ చెప్పారు. ఉపాధ్యాయ బదిలీలపై ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసిందని గుర్తుచేశారు. అలాగే పీఆర్‌సీ బకాయిలు, డీఏ ఇవ్వాలని, పెండింగు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎస్టీయూ, ఏపీ ఉపాధ్యాయ సంఘం, ఉమ్మడి తెనాలి ఏరియా (తెనాలి అర్బన్, తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, చుండూరు, అమర్తలూరు, వేమూరు, కొల్లూరు మండల శాఖలు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో జరిగిన ఈ వేడుకలకు ఎస్టీయూ తెనాలి ఏరియా కార్యదర్శి డీవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథిగా పాఠశాల విద్య ఆర్‌జేడీ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీకే జిలాని, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అమరనాథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏవీ ప్రసాద్ బాబు, వేమూరు ఏరియా కార్యదర్శి ఎం.శ్రీధర్, డాక్టర్ శారద మాట్లాడారు. దుగ్గిరాల జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయిని శోభాదేవి, కవయిత్రిగా గుర్తింపును తెచ్చుకున్న కొలకలూరు ఉపాధ్యాయిని దేవికరాణి, వివిధ మండల శాఖల మహిళా కన్వీనర్లు సహా 23 మందిని ఘనంగా సత్కరించారు. ఉమ్మడి తెనాలి ఏరియా కార్యదర్శి ఎం.శ్రీధర్‌తోపాటు ఏరియాలోని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ గోపాలరావు, ఎం.రవి, జి.మిథున్ చక్రవర్తి, ఎస్.నాగేశ్వరరావు, ఉన్నం ప్రసాద్, మునిపల్లి మోహన కృష్ణ, ఖాన్, ఆరోన్, వినోద్, ప్రసాద్, నాగరాజు, చంద్రశేఖర్, కిరణ్, నాగరాజు, శ్రీనివాస్, రామకృష్ణ, సీనియర్ నాయకులు ఈ.అంబరీషుడు, పట్టణ శాఖ నాయకులు పూషాడపు శ్రీనివాసరావు, ఉమ్మడి తెనాలి ఏరియాలోని రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్య నిర్వాహక సభ్యులు, మండల కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా సినిమా పాటల పోటీలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలనలో రామకోటేశ్వరరావు

సత్తెనపల్లి: చైతన్య కళా స్రవంతి 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఫంక్షన్ హాలులో ఆదివారం జాతీయస్థాయి సినిమా పాటల పోటీలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు హాజరయ్యారు. పోటీల్లో సోలో పాటలకు మాత్రమే అవకాశం కల్పించారు. డ్యూయెట్స్‌ను అనుమతించలేదు. ముందుగా చైతన్య కళా స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లుట్ల రామారావు చిత్రపటానికి చైతన్య కళా స్రవంతి అధ్యక్షులు కమతం శ్రీనివాసరావు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పాటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త పోతుగంటి రామకోటేశ్వరరావు, చైతన్య కళా స్రవంతి ఉపాధ్యక్షులు పిల్లుట్ల రాజా వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి గుండవరపు అమర్నాథ్, ట్రెజరర్ ఎస్‌సీఎం సుభాని, గౌరవ సలహాదారుడు ముట్లూరి వెంకయ్య, కంబాల వెంకటేశ్వరరావు, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

15న ఇళ్ల స్థలాల అర్జీల సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: పేదలకు ఇళ్ల స్థలాల కోరుతూ ఈ నెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు సమర్పించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ కోరారు. అరండల్‌పేటలో పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జూం మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా హామీ అమలులోకి నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఇళ్లు లేని పేదలను సమీకరించి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, బి.శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, మునుగోడు శ్రీనివాసరావు, తాళ్లూరు బాబురావు, సీహెచ్.నిర్మల, షేక్ సుభాని, కాల శివయ్య, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్ చిన జాన్ సైదా, దేవి పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఆత్మహత్యాయత్నం

- వైద్య సిబ్బంది వేధింపులే కారణమంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వేధించారని ఆరోపణలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరోజిని

యద్దనపూడి: యద్దనపూడి పీహెచ్‌సీ పరిధిలోని జాగర్లమూడి గ్రామంలో గతంలో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా విధులు నిర్వహించిన ఓ మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం ఘటన ఆదివారం కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి... యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామంలో సరోజిని ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తుండేది. ఆమె విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తోటి సిబ్బందితో పాటు గ్రామస్తులు పలు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌ఓ విజయమ్మ నాలుగు నెలల క్రితం కేంద్రాన్ని సందర్శించి రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆమెను వివరణ కోరారు. అయినా ఆమె పద్ధతి మార్చుకోకపోవడంతో వైద్యాధికారి శ్రీహర్ష నాలుగు నెలల క్రితం డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు ప్రాంతీయ సంచాలకుల కార్యాలయానికి ఆమెను సరెండర్ చేయడం గమనార్హం. ఈ క్రమంలో ఆమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో యద్దనపూడి పరిధిలోనే హాజరు వేసుకుంటూ తనకు వేతనం మంజూరు చేయడం లేదని కొన్ని రోజులుగా ఆస్పత్రి వైద్యాధికారి శ్రీహర్షపై ఒత్తిడి చేస్తూ అతనితో వివాద పడింది. కొన్ని రోజులుగా వివాదం నడుస్తుందని ఆస్పత్రి సిబ్బంది స్వయంగా సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో జీతాలు, విధులు నిర్వహించాల్సిన ప్రాంతం విషయంలో అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో పర్చూరు పోలీస్ స్టేషన్‌లోను, యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లోను వైద్యాధికారి శ్రీహర్షపై ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులో తనను మానసికంగా వైద్యాధికారి, ఉన్నతాధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. అయినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఆమె ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రిలో చేర్చారు. ఈ విషయం సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో స్థానికంగా కలకలం రేకెత్తింది.

✦ ఈ విషయమై డీఎంహెచ్‌ఓ విజయమ్మను వివరణ కోరగా గతంలో సరోజిని విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటుందనే ఆరోపణలు రావడంతో సాధారణ తనిఖీల్లో భాగంగా విచారించామన్నారు. ఈ విచారణలో రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేక పోవడంతోపాటు అక్కడి స్థానిక వైద్యసిబ్బందితో పాటు ప్రస్తుతం వైద్యాధికారి శ్రీహర్షతోపాటు గతంలో ఉన్న వైద్యాధికారిపై కూడా పలు నిరాధారణ ఆరోపణలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైద్యసిబ్బంది ఆరోపణల నేపథ్యంలో వైద్యాధికారి శ్రీహర్ష జిల్లా కేంద్రానికి సరెండర్ చేయగా తాము ఆర్డీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు చెప్పారు.

✦ ఈ విషయమై రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా యద్దనపూడి పీహెచ్‌సీ కేంద్రం నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి, అక్కడి నుంచి ఆర్డీ కార్యాలయానికి సరెండర్ చేసిన మాట వాస్తవమే అని వివరణ ఇచ్చారు. ఆమెకు మరోచోట బదిలీ చేసేందుకు ఎంఎల్‌సీ కోడ్ అడ్డుగా వచ్చిందన్నారు. నాలుగు రోజుల క్రితం ఆమె ఆర్డీ కార్యాలయానికి వచ్చి జాగర్లమూడి గ్రామంలో పని చేసుకుంటానని ప్రాధేయపడిందని, కానీ ఆమెకు యద్దనపూడి పీహెచ్‌సీలో పనిచేసేందుకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని చెప్పారు. ఆమెకు వేతనాలు మంజూరు చేసే అధికారం యద్దనపూడి పీహెచ్‌సీ వైద్యాధికారికి లేదన్నారు. ఈ ఆత్మహత్యయత్నం ఘటన ఇప్పుడే తెలిసిందని, వాస్తవాలు విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఏఎన్‌ఎంలపై పనిఒత్తిడి తగ్గించాలి

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రోశయ్య


మాట్లాడుతున్న కె.రోశయ్య

బాపట్ల: ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కె.రోశయ్య మాట్లాడుతూ తాలుకా, జిల్లా బాడీలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. 143 జీఓని రద్దు చేయాలని కోరారు. ఏఎన్‌ఎంలపై ఒత్తిడి తగ్గించాలని, గ్రేడ్ 3 ఏఎన్‌ఎంలను వైద్యశాఖలోకి తీసుకోవాలని కోరారు. పీ4 సర్వేలో ఏఎన్‌ఎంలను మినహాయించాలన్నారు. సమావేశంలో నాయకులు సీహెచ్ బెనర్జీ, జె.సుధాకర్, ఎస్.సుబ్బారావు, కె.మారుతి ప్రసాద్, రత్నకుమారి, రమణమ్మ, సైదయ్య, వేణు, మహబూబ్, రాజేష్, బాపట్ల టౌన్ అధ్యక్షుడు జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై సర్కారు ద్వంద్వ వైఖరి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



లక్ష్మీపురం: అంగన్‌వాడీల విషయంలో కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ధ్వజమెత్తారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూటమి నాయకులు అంగన్‌వాడీల సమ్మె శిబిరాలలో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటానికి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా జీతాల పెంపు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 10వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు ముందుగానే అధికారులు, మంత్రులకు యూనియన్ వినతి పత్రాలు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ధర్నాను భగ్నం చేసేందుకు అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా సెక్టార్లవారీగా ట్రైనింగులు ఉంటాయని, దానికి హాజరు కాకపోతే తీవ్ర చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేయడం, యూనియన్ నాయకుల గృహ నిర్బంధాలు, అరెస్టులు ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని చెప్పారు. ఇలాంటి నిర్బంధాలు కొత్త కాదని, వాటన్నింటినీ అధిగమించి పోరాటం చేయగల సత్తా అంగన్‌వాడీలకు ఉందని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను కట్టిపెట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారిపై నిర్బంధం ప్రయోగిస్తే పోరాడే అంగన్‌వాడీలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలోనూ తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. ఒప్పందంలో మట్టి ఖర్చులు రూ.20వేలు ఇవ్వాలని ఉంటే దాన్ని రూ.15 వేలకు కుదించి జీవో ఇవ్వడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. అలాగే రిటైర్మెంట్ సర్వీసు పరిహారం కింది అంగన్‌వాడీలకు రూ.1.20 లక్షలు, హెల్పర్లకు రూ.60 వేలు ఇవ్వాలని ఒప్పందంలో ఉంటే దాన్ని రూ. 20 వేల వంతున తగ్గించారన్నారు. మళ్లీ పేరు మార్చి గ్రాట్యూటీ అని చెబుతూ దానితోనే సంబరపడమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ చార్జీల పెంపుదల, ప్రమోషన్లు తదితర విషయాలపై ఏర్పాటు చేసిన కమిటీని పక్కన పెట్టేశారని విమర్శించారు.

ఒక్క మాత్రతో నులిపురుగుల నివారణ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా సోమవారం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఒకే మాత్రతో నులిపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడాది నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన కోసం 400 ఎంజీ ఆల్బెండజోల్ బిళ్లలను చప్పరించి మింగించాలని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు అరమాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర ఇవ్వాలని సూచించారు. సోమవారం వీలు కాని వారితో ఈ నెల 17వ తేదీన మాపప్ రౌండ్‌లో మింగించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత గంట తేడాతో మాత్రలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. జిల్లాలో అర్హులైన పిల్లలు 4,24,742 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమాన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తారని తెలిపారు. నులిపురుగుల నిర్మూలన వల్ల పిల్లలలో రక్తహీనతను నివారించి వారి ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చని పేర్కొన్నారు.

15 నుంచి 'తిరుమల మహా పాదయాత్ర'

పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి


తెనాలిలో 'గురు పాదధూళి' పాదయాత్ర దృశ్యం

తెనాలి: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని శ్రీవాసవీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఈ నెల 15వ తేదీ నుంచి 'తిరుమల మహా పాదయాత్ర' చేపట్టనున్నారు. రైతు క్షేమార్థం, ధర్మసంస్థాపనార్థం చేపట్టనున్న తిరుమల మహాపాదయాత్రను భక్తజన సమూహంగా ఆరంభించనున్నారు. దీనికి ముందుగా తెనాలిలో 'గురు పాదధూళి' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఆరు గంటలకు స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం శ్రీసాలిగ్రామ పీఠం నుంచి బయలుదేరి బుర్రిపాలెం రోడ్డులోని గోశాల వరకు పాదయాత్ర చేశారు. తిరుమల మహా పాదయాత్ర రోజు వరకు రోజూ గురు పాదధూళి పాదయాత్ర ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. శ్రీసాలిగ్రామ పీఠం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పర్చూరు ఏజీపీగా కొల్లా నరేంద్ర కుమార్



పర్చూరు(చినగంజాం): పర్చూరు కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కొల్లా నరేంద్ర కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అద్దంకి ఏజీపీగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పర్చూరు కోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పర్చూరు కోర్టులో వై. రమేష్ బాబు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పర్చూరు కోర్టు ఏజీపీగా కొల్లా నరేంద్ర కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ జె. వెంకట మురళి ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా ఎడ్లకు ప్రథమస్థానం


నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ఎడ్ల జత

రాజుపాలెం: ఆకుల గణపవరంలో గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 96వ జయంత్యుత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ఆదివారం రసవత్తరంగా జరిగాయి. నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా పంగులూరు చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన ఎడ్ల జత 5,278 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరికి చెందిన చీరబోయిన కోటేశ్వరరావు ఎడ్ల జత 4,250 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవ్వులూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత 4,000 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరానికి చెందిన దివ్యశ్రీ ఎడ్ల జత 3,027 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం నిండుజర్లకు చెందిన ప్రసన్నాంజనేయ ఎడ్ల జత 2250 అడుగుల దూరం లాగి ఐదవ స్థానం సాధించాయి. సోమవారం వ్యవసాయ విభాగంలో పందేలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఒకేసారి 220 ఎలక్ట్రానిక్ డివైజ్‌ల తయారీ

గుంటూరు ఎడ్యుకేషన్: 220 మంది విద్యార్థులు ఒకే వేదికపై ఎలక్ట్రానిక్ డివైజ్ రూపొందించారు. ఉపాధ్యాయుల సూచనలు ఆలకిస్తూ సర్క్యూట్ బోర్డులతో 220 డివైజ్‌లను వారు తయారు చేశారు. డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ అనుబంధ సంస్థ సుగుణ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సుధర్మ ఆడిటోరియంలో 'ఎలైట్ అండ్ ఎనర్జిటిక్ మైండ్స్' పేరుతో ఈ కార్యక్రమం జరిగింది. నాలుగు చక్రాల వాహనాలను రివర్స్ చేసే సమయంలో ఉపయోగించే అలారంతో కూడిన ఎలక్ట్రానిక్ డివైజ్‌ను విద్యార్థులు తయారు చేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌తోపాటు వెంకటకృష్ణాపురంలోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన 220 మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు. సుగుణ సైన్స్ అకాడమీ సీఈవో డాక్టర్ చివుకుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ప్రత్యేక పరిశీలకుడు పత్రి వేణుగోపాల్ సారథ్యంలో డివైజ్‌లు తయారు చేయించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ బోడేపూడి రామారావు అకాడమీ ప్రతినిధులకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.